

మంత్రి వ్యాఖ్యలు హాస్యాస్పదం

రాష్ట్రానికి మంచి చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌పై మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయి. జగన్ హయాంలో ఒక్క మెడికల్ కాలేజీ నిర్మించలేదని చెప్పడం సిగ్గుచేటు. పులివెందులతో పాటు రాష్ట్రంలోని చాలా చోట్ల మెడికల్ కాలేజీల నిర్మాణం జరిగాయి. తద్వారా పేద విద్యార్థులకు పెద్ద సంఖ్యలో మెడిసిన్ సీట్లు అదనంగా అందుబాటులోకొచ్చాయి. కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణపై మొగ్గుచూపి, పేద విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారం చేసేలా కుట్ర చేస్తోంది. న్యాయపరంగా ముందుకెళ్లకపోతే నీట్ రాసిన విద్యార్థులు, తల్లిదండ్రులు రోడ్డెక్కుతారు. – శారద, 19వ వార్డు కౌన్సిలర్, రాయదుర్గం



మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు బాధాకరం

బాధ్యతాయుతమైన మంత్రి హోదాలో ఉన్న సత్యకుమార్.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు బాధాకరం. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పేద,మధ్యతరగతి కుటుంబాల్లోని విద్యార్థులకు వైద్య విద్య దూరం చేయాలని చూస్తోంది. జగన్‌పై ఆరోపణలు చేయడం మానుకొని, ప్రస్తుత ప్రభుత్వం ఏమి చేస్తుందో ప్రజలకు చెప్పాలి. కేంద్రంతో చర్చించి రాష్ట్రానికి అదనంగా మెడికల్ సీట్లు కేటాయించేలా కృషి చేయాలి. నూతన కళాశాలలను ప్రారంభించాలి. – అయూబ్ అలీ, ఉరవకొండ



నిబంధనలకు నీళ్లు

- 'దుర్గం'లో అక్రమ కుళాయి కనెక్షన్లతో కాసులు
- చలానా కట్టకుండానే రోడ్లు ధ్వంసం
- ఇష్టారాజ్యంగా సాగుతున్న పైప్‌లైన్ల తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

రాయదుర్గం: రాయదుర్గం పురపాలక సంఘంలో అక్రమ కుళాయి కనెక్షన్లు కొందరు అధికారులు, సిబ్బందికి కాసులు కురిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో కుళాయి కనెక్షన్లకు గుంతలు ఇష్టారాజ్యంగా తవ్వుతున్నారు. కుళాయి కనెక్షన్‌కు మాత్రమే అధికారికంగా డబ్బు వసూలు చేసి.. తవ్వకానికి చెల్లించిన రుసుం క్షేత్రస్థాయి సిబ్బంది కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ మొత్తం ఖజానాకు అతి తక్కువ జమకావడమే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో తవ్విన రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడం, ఆ ప్రాంతాల్లో ఇష్టారీతిన స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తుండడంతో స్థానికులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. పట్టణంలోని 32 వార్డులు, 18 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 75 వేల మంది జనాభా ఉంది. ఇందులో వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు 11,295, వీధి కుళాయిలు 150 ఉన్నట్టు మున్సిపల్ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. రాయదుర్గం పరిధిలో అన్నివార్డుల్లోనూ సుమారు 18 వేలు నివాస గృహాలు ఉంటాయి. వీటిలో 11,298 కుళాయి కనెక్షన్లు మాత్రమే రికార్డుల్లో నమోదయ్యాయి. ఈ లెక్కన వేలల్లో అక్రమ కుళాయి కనెక్షన్లు ఉన్నట్టు స్పష్టమౌతుంది. పట్టణంలో నిత్యం తాగునీటి వినియోగం పెరుగుతున్నా దానికి తగ్గట్టుగా మున్సిపాల్టీకి ఆదాయం సమకూరడం లేదు. ఇంటిపన్ను లేని వారు సైతం ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నట్టు విమర్శలున్నాయి.



కుళాయి ఏర్పాటు చేస్తున్న పిట్టర్లు

గత ప్రభుత్వంలో ఇంటింటికీ కుళాయి ఇవ్వాలన్నదే లక్ష్యం ..

ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలన్నదే గత వైఎస్సార్‌సీపీ లక్ష్యం. దాన్ని అనుసరిస్తూ మున్సిపల్ పాలక్షపక్షం అవినీతికి తావులేకుండా కుళాయిల ఏర్పాటుకు పెద్దపీట వేసింది. సాధారణంగా ఇంటి యజమాని కుళాయి ఏర్పాటు చేసుకోవాలంటే పురపాలక సంఘంలో తగిన రుసుం చెల్లించి అనుమతి పొందాలి. దరఖాస్తు చేసిన గంటల్లోనే కొళాయిల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. అలాగే ఇంటిముందు సీసీ రోడ్డుందా? లేక మట్టి రోడ్డు ఉందా? అనే విషయం తెలియజేయాలి. పైప్‌లైన్ తవ్వకానికి యజమాని మీటరు ప్రకారం డబ్బు చెల్లించాలి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ వ్యవస్థ కాస్త గాడితప్పింది. క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సీసీదారి పగలగొడితే మీటరుకు రూ.800, మట్టి దారికైతే రూ.400 ప్రకారం వసూళ్లుచేసి ప్రభుత్వ ఖజనాకు జమచేయాలి. ఇది సక్రమంగా జరగడం లేదు. మరికొన్నిచోట్ల ఎలాంటి అనుమతులు లేకనే రోడ్లను ఇష్టారీతిన తవ్వేసి కుళాయి కనెక్షన్లు పొందుతున్నారు. పట్టణంలోని చాలా వార్డుల్లో ఈ విధానం కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నా..అడ్డుకునేవారు లేరు.



గుంత తీస్తున్న దృశ్యం

పట్టణ జనాభా, కొళాయిల వివరాలు	
పట్టణ జనాభా	75 వేలు
వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు	11,298
వీధి కుళాయిలు	150
మొత్తం వార్డులు	32
వార్డు సచివాలయాలు	18
నివాస గృహాలు (సుమారు)	18 వేలు

కఠిన చర్యలు చేపడతాం

కుళాయి కనెక్షన్ల ఏర్పాటులో ఏ చిన్న అవినీతికి పాల్పడినట్టు తెలిసినా కఠిన చర్యలు చేపడతాం. రేషన్‌కార్డు కలిగి ఉండి ఇంటిపన్ను రూ.500 ఉన్నవారు రూ.200 చెల్లించాలి. రూ.500 పైగా ఇంటిపన్ను కట్టేవారు రూ.7 నుంచి రూ.9 వేలు చెల్లించాలి. కుళాయి ఏర్పాటు సమయాన సీసీరోడ్డు తవ్వాలంటే మీటరుకు రూ.800, మట్టి రోడ్డుకు రూ.400 చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తం ఖజానాకు జమచేసి రసీదు పొందాకే అనుమతిస్తాం. ఎక్కడైనా అక్రమ కుళాయి కనెక్షన్లు ఉంటే గుర్తించి తొలగిస్తాం. ఈ విషయం లో పారదర్శకతకే పెద్దపీట వేస్తాం. అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లో తావిచ్చేది లేదు.
– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

అధికార పార్టీ అరాచకాలను అడ్డుకుందాం



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంతతో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు

గుమ్మఘట్ట: అధికార పార్టీ నేతల అరాచకాలు, అక్రమాలు, అన్యాయాలను ఎక్కడికక్కడ అడ్డుకుందామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డిని రాయదుర్గం ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన, చేస్తున్న వారిని గుర్తించి,వారికి అండగా ఉండాలన్నారు.

గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు వద్ద హెచ్చెల్సీలో శనివారం గల్లంతైన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన విజయ్‌కుమార్ (52) కోసం గాలింపు చర్యలు ఆదివారమూ కొనసాగాయి. సాయంత్రం వరకూ కాలువ పరివాహక ప్రాంతాన్ని పోలీసులు జల్లెడ పట్టారు. అయినా విజయ్‌కుమార్ ఆచూకీ లభ్యం కాలేదు. ఉంతకల్లులోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో తులసీ మాలాధారణ కోసం వచ్చిన ఆయన హెచ్చెల్సీలో గల్లంతైనట్లుగా ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు.

రాయదుర్గంలో రేపు నిమజ్జనం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో వినాయక సేవా సమితి ఉత్సవాల్లో భాగంగా కొలువుదీరిన ఆదియోగి శివుడి రూపంలోని హిందూ మహాగణపతికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. 9వ రోజు ఆదివారం మహాగణపతి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం రాత్రి విధూషి జ్యోతి శ్రీకళారాధన భరత నాట్యం డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నృత్య రూపక కురుక్షేత్రం భక్తులను ఆకట్టుకుంది. మహాగణపతి ఉత్సవ లాటరీలో భాగంగా మొదటి బహుమతి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్, ద్వితీయ బహుమతిగా ఎలక్ట్రిక్ స్కూటర్‌ను సభావేదిక వద్ద ప్రదర్శించారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. 11రోజుల పాటు జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17న నిమజ్జనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



రాయదుర్గంలో పూజలందుకుంటున్న హిందూ మహాగణపతి



కణేకల్లులో చిన్నారుల కోలాటం నడుమ గణేషుడి ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

ఘనంగా వినాయకుల శోభాయాత్ర

కణేకల్లు: కణేకల్లులో ఆదివారం వినాయకుల శోభాయాత్ర ఘనంగా జరిగింది. స్థానిక రామాలయ వీధి, భీరప్పగుడి వీధి, వినాయకనగర్, సిద్ధప్పగుడి వీధుల్లో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న వినాయక ప్రతిమలను ఊరేగించారు. రామాలయవీధిలో కొలువుదీరిన వినాయకుడి ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఊరేగింపు అనంతరం రామనగర్‌లోని హెచ్చెల్సీ కాలువలో వినాయకులను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏఎస్‌ఐ శంకర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములతో పాటు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిద్దాం

రాయదుర్గంటౌన్: నియోజకవర్గాల్లో మెయిల్స్ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. రాయదుర్గంలో కూడా ముస్లింలందరూ మెయిల్స్ పంపే కార్యక్రమాన్ని జోరుగా సాగించారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ముస్లిం యువతదేనని ముస్లిం మత పెద్దలు చైతన్య పరుస్తున్నారు. మెయిల్స్, స్కానర్ ద్వారా ముస్లింలు ప్రతి ఒక్కరూ కేంద్రం తెస్తున్న వక్ఫ్‌బోర్డు చట్టం 2024ను వ్యతిరేకిస్తూ మెయిల్ పంపిస్తున్నారు. దేశవ్యాప్తంగా 25 కోట్ల మంది ముస్లిం మైనారిటీలు ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో ఖురాన్ పఠనం



ఆసార్ మకాన్ వద్ద మిలాద్ పఠనం చేస్తున్న ముస్లింలు

ఉరవకొండ: ముస్లిం ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకొని దేశవ్యాప్తంగా జరిగే మిలాద్ ఉన్ నబి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేశారు. స్థానిక జామీయా మసీదు వద్ద ఉన్న ఆసార్ మకాన్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆసార్ మకాన్ వద్ద ముస్లింలు పెద్ద ఎత్తున భక్తిశ్రద్ధలతో ఖురాన్ పఠనం చేసి, దువా చేశారు. మిలాదున్ నబీ వేడుకల్లో భాగంగా ఉదయం జెండా ఊరేగింపు, పట్టణ పురవీధుల గుండా నిర్వహించి, సాయంత్రం మహ్మద్ ప్రవక్త కేశఖండనాన్ని భక్తులకు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లలో నిమగ్నమైన దర్గా మసీదు కమిటీ నిర్వాహకులు

నేడు మిలాద్ ఉన్ నబీకి ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గంటౌన్: మిలాద్ ఉన్న నబీ (మహమ్మద్ ప్రవక్త జన్మదినం) వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ముస్లింలు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఆదివారం రాత్రి మసీదుల్లో పట్టణంతోపాటు గ్రామాల్లోని అనేక మసీదులను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. మసీదుల్లో ప్రవక్త జన్మదినం సందర్భంగా ఇషా నమాజ్ అనంతరం జాగ్‌నేకి రాత్ (జాగరణ) చేశారు. మసీదుల్లో మౌలానాలు ప్రవక్త జన్మదిన విశిష్ట, ఆయన సందేశాలను వివరించారు. ఉదయం 9 గంటల నుంచి పట్టణంలోని దర్గా మసీదు కమిటీ ఆధ్వర్యంలో జూలుస్ (మక్కా, మదీన నమూనాలతో ఊరేగింపు) నిర్వహించనున్నారు.

దోమలు నివారణకు సహకరించండి



పొబ్బర్లపల్లిలో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో పడమటి కోడిపల్లి పంచాయతీ పొబ్బర్లపల్లి, శాంతినగర్ గ్రామంలో సర్పంచ్ మమత ఆధ్వర్యంలో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం గ్రామాల్లో దోమలు నివారణ కోసం ఫాగింగ్ చేయించారు. సర్పంచు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు గ్రామాల్లో ప్రజలు కూడా సహకరించాలన్నారు. వీధుల్లో రోడ్లపై చెత్తాచెదారం పడేయరాదని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంగాధర, మాజీ డీలర్ మంజు, కంబాల నాగరాజు, నాగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య సేవలు అజరామరం

కుందుర్పి: చరిత్ర పుటల్లో స్థానం సంపాదించిన మోక్షగుండం విశ్వేశ్వర్యయ్య సేవలు అజరామరం అని ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు అన్నారు. ఆదివారం తూముకుంటలోని విలువల బడిలో ఇంజనీర్స్‌డే జరుపుకున్నారు. దేశవ్యాప్తంగా విశ్వేశ్వరయ్య నిర్మించిన కట్టడాలు – వాటి ప్రాముఖ్యత, ఆయన జీవిత విశేషాలను వివరించారు.

డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె



ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఉరవకొండ: డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె చేస్తామని ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు స్పష్టం చేశారు. ఆదివారం రెండో రోజు సమ్మెలో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నా అధికారులు, కాంట్రాక్టర్ తమ సమస్యలు పరిష్కరించలేదన్నారు.

తూముకుంటలో తీవ్ర తాగునీటి ఎద్దడి

కుందుర్పి: మండలంలోని తూముకుంట, కృష్ణాపురం తదితర గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలోని బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. దీనికితోడు తాగునీటి పథకం విద్యుత్ మోటారు మరమ్మతుకు గురయ్యాయి. స్థానిక ప్రజాప్రతినిధులు మరమ్మతులు చేయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో నీటి సమస్య తలెత్తినట్లు గ్రామస్తులు బాబు, తిమ్మరాజు, గంగాధర, రాజ్‌కుమార్ తదితరులు తెలిపారు.



ట్యాంకు వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి విగ్రహం



పూజలలో పాల్గొన్న భక్తులు

ఘనంగా ఓనం పూజలు

కళ్యాణదుర్గం: స్థానిక విద్యానగర్‌లో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం ఓనం పండుగను అయ్యప్ప భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. కేరళ తరహాలో స్వామికి అన్ని అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఓనం పండుగ సందర్భంగా ఆలయ గురుస్వామి వెంకటేశులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

జరుట్ల రామలింగేశ్వరుడికి భస్మాభిషేకం



వజ్రకరూరు: మండలంలోని జరుట్లరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భస్మాభిషేకం నిర్వహించారు. ఆలయంలో స్వామికి అర్చనలు, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామికి 50కిలోల భస్మంతో బస్మాభిషేకం నిర్వహించారు. అనంతరం మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

కళకళలాడుతున్న పంటలు



వజ్రకరూరు వద్ద పచ్చగా కళకళలాడుతున్న వేరుశనగ పంట

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలు కళకళలాడుతున్నాయి. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ, కంది,ఆముదం, సద్ద తదితర పంటలు పచ్చగా కనిపిస్తున్నాయి. పొలాల్లో ఎక్కడ చూసినా పచ్చదనం కనిపిస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నులిపురుగుల నివారణ బ్రోచర్ల విడుదల



బ్రోచర్‌లు విడుదల చేస్తున్న దృశ్యం

వజ్రకరూరు: ఈనెల 17న జరుగనున్న జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం సందర్భంగా బ్రోచర్లను ఆదివారం విడుదల చేశారు. మండలంలోని చాబాలలో సర్పంచు మల్లెల జగదీష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటేష్, హెల్త్‌ఎడ్యుకేటర్ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ పద్మా, ఆరోగ్య కార్యకర్తలు ఇందిర, పావని,అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రమణి, శశికళ, సరోజ, సోమేశ్వరి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజావేదిక '

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామీణ ఉపాధిహామీ పథకం 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2023 నుంచి 2024 మార్చి 31 వరకు ఉపాధిపనుల వేతన చెల్లింపులపై బహిరంగ చర్చా వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ముస్లింలకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు



మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: నియోజకవర్గంలోని ముస్లింలకు ఉరవకొండ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు ఆదివారం తెలియజేశారు. సోమవారం మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారు. మహ్మద్ ప్రవక్త అనుసరించిన మార్గంలోనే ప్రతి ఒక్కరూ నడిచి, దానం, దాతృత్వ గుణాన్ని చాటుకోవాలని విశేశ్వరరెడ్డి తెలిపారు.

మిలాద్ ఉన్ నబీ సంతోషంగా జరుపుకోవాలి



తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

కళ్యాణదుర్గం: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ముస్లిం దైవ మార్గంలో నడవాలన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలన్నారు. నియోజకవర్గ ప్రజలు అల్లా దీవెనలతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన కోరుకున్నారు.

ఆలయ పునరుద్ధరణకు రూ.5 లక్షల విరాళం



ఆలయ కమిటీకి విరాళంగా అందిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లిలోని సవారమ్మ ఆలయ పునరుద్ధరణ పనులకు భక్తుడు జీకే కృష్ణమూర్తి రూ.5లక్షలు విరాళంగా అందించారు. ఆదివారం గ్రామ ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ హనుమంతరాయుడు తదితరులు నగదు అందించారు.

ఉచిత వైద్యశిబిరం



ఆపరేషన్లకు ఎంపికైన వారికి సూచనలు చేస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌పీ సభ్యులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. నంద్యాల శాంతిరాం మెడికల్ కళాశాల వైద్య బృందం 485 మందికి గుండె, కంటి, కిడ్నీ పరీక్షలు చేసినట్లు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కావలి ఈశ్వర్, జిల్లా అడిషనల్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. 75 మంది కంటి శస్త్రచికిత్సలు, 13 మంది గుండె ఆపరేషన్లకు ఎంపికైనట్లు తెలిపారు. ఎన్‌హెచ్‌ఆర్‌పీ రాయలసీమ జోనల్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ రజియా బేగం మాట్లాడారు. రాయదుర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్‌రెడ్డి, గుమ్మఘట్ట మండల ప్రెసిడెంట్ లక్ష్మీరెడ్డి, బొమ్మనహాళ్‌శాఖ రాముడు, రాయదుర్గం ఇన్‌చార్జ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి రవాణా



కొండను తవ్వి మట్టి తరలించిన దృశ్యం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పట్టణ శివారు ప్రాంతాల్లోని కొండగుట్టల్లో మట్టి (గ్రావెల్) అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణంలోని కణేకల్లు రోడ్డు ఎంసీఏ కళాశాల, ఇందిరమ్మ లేఅవుట్‌లు, గౌడ లేవుట్ సమీపంలోని కొండల్లో నుంచి గ్రావెల్ తవ్వి రోజూ ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకుని కొండగుట్టలను పరిరక్షించాల్సిన అధికారులు పట్టించుకోలేదు. రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ప్రైవేట్ వ్యక్తులు తమ స్థలాలకు ప్లాట్లు వేసి రోడ్లను చదును చేసేందుకు కొండల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నారు. గనులశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా గ్రావెల్ తరలిస్తున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఈఓపీఆర్‌డీ దాస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి శివన్న పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. శనివారం గ్రామంలో చిన్నారి అజయ్‌కుమార్ డెంగీ లక్షణాలతో మృతిచెందిన విషయం విదితమే. దీంతో అధికారులు, సర్పంచు కవిత ఆధ్వర్యంలో అపరిశుభ్రతను తొలగింపజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ యుగంధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.